క్లుప్తంగా

21న బ్రాహ్మణ చైతన్య సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొత్త రాఘవేంద్రస్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రాహ్మణ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో బ్రాహ్మణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన

ప్రొద్దుటూరు : తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె గురువారం 38వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

దువ్వూరు : మండలంలోని చింతకుంట సచివాలయం–2 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



ఓంశాంతి భవన్‌లో శాంతి స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్ ఇన్‌చార్జి బీకే శాంత పేర్కొన్నారు. గురువారం ఓం శాంతి భవన్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు బ్రహ్మబాబా 55వ పుణ్యతిథిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాచీన రాజయోగాను విస్తరింప చేసి విశ్వమానవ కళ్యాణానికి కృషి చేసిన మహనీయుడు బ్రహ్మబాబా అని చెప్పారు. సత్‌ప్రవర్తనతోనే విశ్వపరివర్తన సాధ్యమని చెప్పి రాజయోగా ద్వారా మహిళలను, యువతను చైతన్య పరిచారన్నారు.

నేటి నుంచి కుల గణన సర్వే

చాపాడు : మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి కుల గణన సర్వే నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్లకు ప్రజలందరూ సహకరించాలన్నారు. పది రోజుల పాటు గ్రామాలలో కుల గణన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట గ్రామంలో పేకాట ఆడుతున్న 5 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 5 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4050లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

21న డైరీ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : కడప జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈనెల 21న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఏపీ ఎలక్ట్రిసిటి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ ఆవిష్కరణను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం డైరీ ఆవిష్కరణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి విజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని శ్రీజగద్గురు వేదాంతం లక్షణార్యుల 82వ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం ధ్యానం, ఉపనిషత్ పారాయణం, గురుపూజ, భగవద్గీత వేదాంత ఉపన్యాసాలు ఉంటాయని పేర్కొన్నారు. శ్రీకాళహస్తికి చెందిన శ్రీరామ చైతన్యస్వామి, షోలాపూర్‌కు చెందిన అల్లి నరసయ్య పంతులు, కృష్ణచైతన్యస్వామి, ఉమాసుదర్శన్ తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారని వివరించారు. వార్షికోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దు

పోలీసులకు ఎమ్మెల్యే రాచమల్లు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : దాడులతో ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని పోలీసులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఇటీవల తగు పత్రాలు, బిల్లులు లేవనే కారణంతో పోలీసులు పెద్ద మొత్తంలో నగదును సీజ్ చేశారు. దీనిపై పట్టణంలోని బంగారు వ్యాపారస్తులు గురువారం మెయిన్‌బజార్‌లో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే నిరసన శిబిరం వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసుల తనిఖీలతో ప్రజా జీవనం స్తంభించే పరిస్థితి కలుగుతోందని తెలిపారు. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు చేస్తున్నారన్నారు. ఆడపిల్లల పెళ్లికి బంగారు కొనడానికి వచ్చిన వారు, రిజిస్ట్రేషన్ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన వారి వద్ద నుంచి తగు పత్రాలు లేవంటూ డబ్బును సీజ్ చేస్తున్నారని చెప్పారు. రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించి డబ్బు తీసుకెళ్లాలన్నా భయపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. బిడ్డల పెళ్లి కోసం సామాన్య ప్రజలు అప్పు చేసి బంగారు కొనుగోలు చేస్తుంటారని, వీరు బిల్లులు ఎలా తెస్తారని ఎమ్మెల్యే అన్నారు. అలాగే ఎన్నడూ లేని విధంగా వాణిజ్య సముదాయాల వద్ద మాటు వేసి తనిఖీలు చేయడం సబబు కాదన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకమునుపే తనిఖీల పేరుతో రాజకీయాలతో సంబంధం లేని సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకోవాలని ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులను కోరుతున్నామన్నారు. పోలీసులు రాజకీయ నాయకులపై నిఘా పెట్టాలని, వ్యాపార వర్గాలపై కాదని తెలిపారు. అనంతరం సీఐలతో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడారు. దయచేసి వ్యాపారాలకు ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా సహకరించాలని కోరారు. ఇది నిరసన కాదని, అధికారులపై వ్యతిరేకతతో చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు వ్యాపారులు బుశెట్టి రామ్మోహన్, ఉప్పర మురళి, రాజశేఖర్, మధు వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, కోనేటి సునంద, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి రూ. 5 లక్షలు అందజేత



ముస్లిం పెద్దలకు రూ. 5 లక్షల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని బొజ్జవారిపల్లె గ్రామ ముస్లింల కోరిక మేరకు ఆ గ్రామంలోని మసీదులు, కబరస్థాన్ల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రూ.5 లక్షలు అందచేశారు. గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ రమణారెడ్డి, ముస్లిం పెద్దలు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని రెండు మసీదుల్లో వజూఖానాతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయాలని ముస్లిం పెద్దలు గతంలో ఎమ్మెల్యే రాచమల్లును కోరారు. అలాగే మసీదు సమీపంలోని డ్రైనేజీ కాలువ, కల్వర్టు ఏర్పాటు చేయడంతో పాటు కబరస్థాన్‌లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని అడిగారు. పంచాయతీలోనూ, వక్ఫ్‌బోర్డులో తగినన్ని నిధులు లేకపోవడం వల్ల కాలయాపన జరుగుతుందని భావించిన ఎమ్మెల్యే రాచమల్లు తన సొంత నిధులతో ఈ పనులను చేస్తానని వారికి చెప్పారు. ఈ మేరకు రూ. 5 లక్షల నగదును ముస్లిం పెద్దలకు అందచేశారు. అనంతరం కమిటీ పెద్దలు, ముస్లింలు ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటి సభ్యులు రూహుల్లా, మహబూబ్‌బాషా, అహ్మద్, ఖాజా, నాయబ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఈ పోటీలలో భాగంగా గురువారం జెఎన్‌టీయూ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో క్రికెట్ పోటీలకు 18 టీములు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్‌కు చిన్నరంగాపురం, సియోన్‌పురం టీములు చేరుకున్నాయి. ఈనెల 20వ తేదీన ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను గురువారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, కోడి రమణ, డేనియల్, చంద్రమౌళి, నాగరాజు, సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల అపహరణపై ఫిర్యాదు

కొండాపురం : ఇటీవల వరుసగా పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను రాత్రి వేళ పగలగొట్టి అందులోని కాపర్ వైర్‌ను అపహరిస్తున్న సంఘటనలపై గురువారం తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో మండల విద్యుత్ శాఖ ఏఈ ఎం.ఓబులేసు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆకట్టుకుంటున్న సురభినాటకాలు



సురభి నాటకంలో ఓ సన్నివేశం

పులివెందుల రూరల్ : చక్రాయపేట మండలంలోని సురభి గ్రామంలో పుట్టిన ఈ సురభి నాటకాలు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందుతున్నాయి. సంక్రాంతి పండు సందర్భంగా పులివెందులలోని గరండాల్ రివర్ ఫ్రంట్ (రాణితోపు)లో గురువారం 6వ రోజు నాటక ప్రదర్శనను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన సురభి నాటకాలను పట్టణ ప్రజలు ఎంతో ఆనందంగా తిలకించారు.

సకాలంలో పైప్‌లైన్ పనులు పూర్తి చేశాం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని బొల్లవరం నుంచి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ వరకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పనులను సకాలంలో పూర్తి చేశామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంచి నీటి పైప్‌లైన్ పనుల కోసం కొంత భాగం తొలగించిన రోడ్డు స్థానంలో ఇటీవల ప్యాచింగ్ వర్క్ చేశారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే రోడ్డును పరిశీలించి గ్యాంగ్ వర్కర్ల ద్వారా శుభ్రం చేయించారు. అనంతరం విజయకుమార్ సర్కిల్‌లో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పైప్‌లైన్ పనుల కోసం అదనంగా డబ్బును వెచ్చించి పద్ధతి ప్రకారం పూర్తి చేసినట్లు తెలిపారు. బొల్లవరం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు రోడ్డును శుభ్రం చేశామన్నారు. ప్రతి వారం గ్యాంగ్ వర్కర్లతో వీధులను శుభ్రం చేయిస్తామని తెలిపారు. ప్రత్యర్థుల విమర్శలను పట్టించుకోనని, టీడీపీ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా తాను అభివృద్ధి వైపే దృష్టి సారిస్తానన్నారు. కొన్ని రోజుల క్రితం బుశెట్టి రాము బంగారు దుకాణంలో ఇన్‌కంట్యాక్స్ అధికారులు దాడులు నిర్వహిస్తే ఆ దాడులు కూడా తానే చేయించానని ప్రచారం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పోలీసులు దాడులు చేస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్‌లో దోశ రేటు పెంచినా దానికి కూడా ఎమ్మెల్యే కారణమంటూ ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎవరు ఎన్ని మాటలు అన్నా బాధ పడనని తనకు ఈ గౌరవం ఇచ్చింది ప్రజలే అని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజల ఆశీస్సులు తనకు ఎప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, కమిషనర్ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ జయచంద్రా రెడ్డి

దువ్వూరు : మండలంలో ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గ్రామస్థాయిలో గెలిచిన జట్లను మండల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం దువ్వూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు కుంపటి ఖాజీపీర్, సిరిపిరెడ్డి నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఉన్న యోగివేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలో గురువారం యోగివేమారెడ్డి జయంతి వేడుకలను నిర్వాకులు ఘనంగా జరుపుకున్నారు. జయంతి సందర్భంగా బ్రహ్మం భక్తులకు ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ల అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు చిన్న ఓబుల్‌రెడ్డి, అధ్యక్షుడు గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి శశికాంత్‌రెడ్డి, గురివిరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పట్టాబిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి. సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

22న అయోధ్య వేడుకలు

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె వద్ద వెలసిన దశరథ మహారాజు ఆలయం వద్ద ఈనెల 22న అయోధ్య వేడుకలను ఘణంగా నిర్వహిస్తున్నట్లు దర్మకర్త దశరథ తెలిపారు. నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్ వద్ద నుంచి ఉదయం 10 గంటలకు దశరథ మహారాజుస్వామి ఆలయం వరకు సీతారాముల ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం 12 గంటలకు అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయం వద్ద భక్తులకు ఎల్‌ఈడీ తెరపై లైవ్ ప్రదర్శన చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గోపవరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకునే విషయంలో లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి పనులు మొదలు పెట్టేలా చూడాలన్నారు. శుక్రవారం నుండి ప్రారంభమయ్యే కులగణన సర్వేపై సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం తెలియజేశారు. చేపట్టే కులగణన సర్వే పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు కులగణన సర్వేను పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆయా సచివాలయాల వారీగా అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. సమీక్షలో ఈఓపీఆర్‌డీ హసీనా, ఎంపీటీసీ సరస్వతి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బి.మఠంలో దళితుల ర్యాలీ



బి.మఠంలో దళితుల సమావేశానికి స్థలం పరిశీలిస్తున్న ఎంపీపీ, దళిత నాయకులు

బ్రహ్మంగారిమఠం : విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణ ప్రారంభ నేపథ్యంలో మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం లో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని దళితులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 3గంటలకు మఠం నాల్గు రోడ్లు కూడలి నుంచి భారీ ర్యాలీ సాగుతుందన్నారు. పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడనుంచి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభ అనంతరం 5గంటలనుంచి విజయవాడలో ముఖ్యమంత్రి ప్రసంగంను ప్రత్యక్షంగా దళితులు తిలకిస్తారని పేర్కొన్నారు. బహిరంగ సభకు స్థలంను ఎంపీపీ. సి.వీరనారాయణరెడ్డి. పాలరామిరెడ్డి, అమగంపల్లె ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాజు, నాగార్జున,గురుమూర్తి, దళిత నాయకులు జోగయ్య, నారాయణ, నరసింహులుతదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పులివెందుల రూరల్ : పట్టణంలో జరుగుతున్న మోడల్ టౌన్ అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాదులు పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని సెంట్రల్ బోలేవార్డు, పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారస్థులకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్ గదులను పరిశీలించారు. అంకాలమ్మ ఆలయంకు సంబంధించి శిరిబండి వెళ్లే విధంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక ముఖ్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్

కాశినాయన : గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళిక ముఖ్యమని ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్ తెలిపారు. గురువారం నరసాపురం స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలో ఏయే పనులు చేపట్టాలో ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీలో మౌలిక వసతులు గుర్తించి వాటి ద్వారానే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శర్మ, సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దివిజ

వేంపల్లె : మండలంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే డ్రైనేజీ పారిశుద్ధ్యం, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. గురువారం మండల సభాభవనంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా రాబోవు వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డ్రైనేజీ, వీధిలైట్లు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో గ్రావెల్ రోడ్డు తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ మల్లికార్జునరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మొయినుద్దీన్ తనఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా హాజరు కాక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వైద్యురాలు సుభాషిని, పార్మసిస్టులు సమయ పాలన పాటించ కుండా పులివెందులలో ఎఫ్ఆర్ఎస్ హాజరు వేసుకుంటున్నారన్నారు. ఇలా జరిగితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక తప్పనిసరి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్

పోరుమామిళ్ల : పంచాయతీల అభివృద్ధికి ఓ ప్రణాళిక తప్పనిసరి అని, నిధులను వినియోగించుకోవడంలో ప్రణాళిక ఉపయోగ పడుతుందని ఎంపీడీఓ వరప్రసాదరావు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. స్థానిక సభాభవనంలో గురువారం పంచాయతీ సిబ్బందికి ఆయన రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆదాయ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను సమర్ధవంతంగా వినియోగించుకుంటే పంచాయతీ అభివృద్ధి దిశలో సాగుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సీఎం బాషా, ఈఓపీఆర్డీ మమతాబ్ యాస్మిన్, ఆర్పీలు నారాయణబాబు, రవీంద్రారెడ్డి వివిధ అంశాల గురించి వివరించారు. శిక్షణలో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వార్డు మెంబర్లు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళమిస్తా



గ్రామ పెద్దలతో సమస్యలపై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి

ఖాజీపేట : పూసలకొట్టాలు గ్రామంలోని రామాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం విస్తానున్నట్లు పుల్లూరు మాజీ ఉప సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి గ్రామ పెద్దలకు హామీ ఇచ్చారు. పూసల కొట్టాలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి నిధుల సమస్య ఏర్పడింది. ఇదే విషయం గ్రామ పెద్దలు పుల్లూరు పంచాయితీ నాయకుడు వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించి ఆలయ ప్రహరి గోడ నిర్మాణం తోపాటు ధ్వజస్తంభ ఏర్పాటుకు అదనంగా రూ లక్ష ఇస్తున్నట్లు హామీ ఇచ్చారు. మండల కోఆప్షన్‌సభ్యుడు మున్వర్, గ్రాస్తులు కుళ్ళాయప్ప, మూర్తి తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.నాగరాజు

అట్లూరు : రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేద్దామని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. బద్వేలు వ్యవసాయ కార్యాలయంలో గురువారం అట్లూరు, బద్వేలు, గోపవరం, సిద్ధవటం మండలాల వ్యవసాయ అధికారులకు, రైతుభరోసా కేంద్రాల సహాయకులకు ఆయన ఒక్కరోజు శిక్షణ కార్యాక్రమం నిర్వహించి మాట్లాడారు. పంటకోత ప్రయోగాలు, ఉత్తమ యాజమాణ్య పద్ధతులు, సున్నా వడ్డీ, పంటరుణాలు, ఎరువుల పంపిణీ తదితర అంశాలపై వివరించారు. అలాగే రబీ సీజన్‌లో పంటల సాగు, వివిధ రకాల తెగుళ్ల నివారణ, సస్యరక్షణచర్యలపై రైతులకు అవగాహణ కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు చంద్రమోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య, సురేష్‌రెడ్డి, ఆయా మండలాలలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి రైతు టెక్నాలజీని వినియోగించుకోవాలి

అట్లూరు : ప్రతి రైతు టెక్నాలజీని వినియోగించుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు తెలిపారు. గురువారం బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయం ఆవరణలో రైతులతో సమావేశమై మాట్లాడారు. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి రైతు రైతు భరోసా యూటూబ్ చానల్‌ను ఓపెన్ చేసి తద్వారా ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అలాగే ఈ చానల్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో పాటు వాతావరణ సాంకేతికత తదితర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తారన్నారు. అనంతరం రైతులకు వారి సెల్ ఫోన్‌లలో వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎలా తెలుసుకోవాలో వివరించారు.

ఆలోచనల పరివర్తనతో సంతోషం

పోరుమామిళ్ల : మనలో ఆలోచనల పరివర్తన ద్వారా సంతోషంగా జీవించవచ్చని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు స్వప్న అక్కయ్య తెలిపారు. ప్రజాపిత బ్రహ్మబాబా భౌతిక శరీరం వదలి పరమేశ్వరుని ఒడిని చేరుకున్న జనవరి 18 సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఓం శాంతి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కంటికి కనిపించే భౌతిక శరీరం కాదని, చైతన్య శక్తి ఆత్మ అని తెలుసుకుని పరమశాంతి అనుభూతి పొందాలని, మనసులో ఎలాంటి చెడు ఆలోచనలులేని మానసికస్థితి కలిగిఉండాలని, నేను అనే అహంకార భావన వదిలి సంతోషంగా ఉండాలని చెప్పిన బ్రహ్మబాబా మాటలు ఎల్లప్పుడూ స్మరణలో ఉంచుకోవాలన్నారు. మనలో కలిగే ఆలోచనలో పరివర్తన తెచ్చుకుంటే అన్నీ మంచిగా ఉంటాయన్నారు. సమావేశంలో పట్టణ బ్రహ్మకుమారీ సభ్యులు పాల్గొన్నారు.